# రంగులేని జీవితం

మిట్టమధ్యాహ్నం ఒంటిగంట వేళ.—

రోహిణీకార్తి రంగు పూసుకున్న సూర్యుడు ఎర్రని గోళంలా మండి పోతున్నాడు. ఆ ఎర్రని ఎండలో నర్శింలు రిక్షా తొక్కుతున్నాడు.

ఒళ్ళంతా చెమటలు దిగ్గారుతున్నాయ్-వేసుకున్న ఖద్దరుబనీను పూర్తిగా తడిసిపోయింది.

"టైం ఎంతైంది బాబయ్యా?" రిక్షా తొక్కుతూనే కూర్చున్న గిరాకీని అడిగాడు.

"ఒంటిగంట" కూర్చున్న గిరాకి జవాబు.

ఇంక గుడిసెకి పోవాల, మల్లి ఎదురుచూస్తూ వుంటుంది అనుకున్నాడు నర్శింలు.

ప్రొద్దున ఏడింటికి సయ్యద్ షాపులో ఇన్ని టీనీళ్ళు తాగి రిక్షా ఎక్కితే ఆఫీసులకెళ్లేవాళ్లని, స్కూళ్లకెళ్లేవాళ్లని దింపేసి, ఇంకా చిల్లర మల్లర గిరాకీలు చూసుకుని, ఒంటిగంటకిగాని గుడిసెకి చేరడు నర్శింలు. అప్పటికే మల్లి, మావ ముందురోజు సంపాదనతో నూకలు కొని వుడకేసి, నర్శింలు కోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఇద్దరూ కల్సి వున్నదేదో తిని కాసేపు కబుర్లాడుకుంటారు. మరికాసేపు సరసాలాడుకుంటారు. మళ్లీ మ్యాట్నీ సినిమాల వేళకి నర్శింలు రోడ్డెక్కుతాడు రిక్షాతో సహా.

నర్శింలు రిక్షాని ఎర్రత్రికోణం ఆఫీసువద్ద ఆపాడు. రిక్షాలో కూర్చున్న వ్యక్తి దిగి డబ్బులిచ్చి వెళ్లిపోయాడు. నర్శింలు ఒక్కసారి మొహానికి పట్టిన చెమటని తుడుచుకుంటూ ఎర్రత్రికోణం ఆఫీసుతాలూకు బోర్డువంక చూశాడు.

యాపిల్‌పండులాంటి పసిపిల్లాడు నిండుగా నవ్వుతున్నాడు. నర్సింలుకి ఒక్కసారిగా మల్లి గుర్తుకొచ్చింది-ఏదో ఆలోచనొచ్చింది. ముసిముసిగా నవ్వుకొంటూ రిక్షాని గుడిసెవైపుగా తిప్పాడు.

తిన్నగా గుడిసెకెళ్లిపోయి, గంజి తాగింతర్వాత, తీరుబడిగా బీడీ ముట్టించి మల్లితో "ఇదిగో చూడు! కడుపుతో వున్నోళ్లకి ఏవేవో కొర్కెలు పుడతాయంట, ఏదేందో తినాలనుంటుందంట, నీకేం అనిపించటంలా ?" ఆసక్తిగా అడిగాడు.

ఆమాట విన్న మల్లి సిగ్గుతో మెలికలారుతూ "ఛ ఫో! పాడుమాటలు" అంది.

నర్సింలు బీడీ దమ్ము గట్టిగా లాగి, "సిగ్గుపడమాక-పిచ్చిమొహమా! ఏందైనా గావాలంటే అడిగెయ్" అన్నాడు ఆప్యాయంగా.

మల్లి ఒక్కక్షణం కళ్ళెత్తి నర్సింలు మొహంలోకి చూసింది. అతడంటున్నది హాస్యానికి కాదని-తనపట్ల అతడికున్న ఆప్యాయత, అనురాగంతోనేనని నిర్ధారణకొచ్చి, మెల్లిగా లేచి నర్సింలు పక్కకొచ్చి "మావా! మరి నాకోటి కావాలి తెస్తావా" లాలనగా అడిగింది.

"ఏం కావాల?" ఆత్రంగా అడిగాడు.

మల్లి ఒక్కక్షణం తటపటాయించి మెల్లిగా—

"మావా..... మరి.... మరే.... నాకెన్నాళ్లనించో కోరిగ్గా వుంది... ఈ గోళ్లకి రంగేసుకోవాలని., మరి గోళ్లరంగుసీసా తెస్తావా ?" శంఖులా పెరిగిన గోళ్లవంక చూసుకుంటూ అంది.

అది విన్న నర్సింలు పగలబడి నవ్వాడు, చేతిలో వున్న బీడీని అవతలికి గిరాటేసి "ఎర్రి మొకమా! ఆ రంగులు, హంగులూ అందంలేని చెక్క బొమ్మలకిగాని, నీలాంటోళ్ళకి గాదే" అన్నాడు మల్లివంక కొంటెగా చూస్తూ.

మల్లి కోపంతో మూతిని మూడు తిప్పలుతిప్పి "అం తే లే! అడగ మన్నావ్-అడిగాక కాదంటున్నావ్-అసలు నేనంటే నీకు పేమలేదు" అంది అలక నటిస్తూ.

నర్శింలు మళ్ళీ నవ్వాడు. "అదికాదే మల్లీ! ఎవరన్నా పండకుగుతారు. మిఠాయి అడుగుతారు - కాని ఇదెందో గోళ్లరంగు మోజు" అన్నాడు.

మల్లి ఇంకా కోపం నటిస్తూ "అపునయ్యా కొందరికి తింటే కడుపు నిండుద్ది నాలాంటోళ్లకి అడిగింది స్తేనే కడుపు నిండిపోద్ది" అంది.

ఈసారి నర్సింలు నవ్వలేదు—-

"సరేలే అట్లాగే కొనుక్కుందువు గానిలే" అనేసి బయటికొచ్చాడు.

అతడి వెనుక మల్లి తృప్తిగా నవ్వుకుంది.

అట్టాగేలే అని అనడం అయితే అన్నాడుగాని ఎట్టాగో ఎంత గింజు కున్నా అర్థంకాలేదు.

అప్పటికప్పుడే ఒక షాపులో అడిగాడు. 'గోళ్లరంగు ఖరీదెంత' అని.

మామూల్దయితే నాల్గు రూపాయలు, ఇంకా మంచిదైతే అయిదు రూపాయలు.

తన రోజంతా ఒళ్లు హూనం చేసుకుని రిక్షా తొక్కినా, రిక్షా అద్దెపోను ఏడు రూపాయల కన్నా ఎక్కువ మిగలవు.

అందులో తన టీ ఖర్చులు, బీడీ ఖర్చుల్లాంటి సాదర పోగా అయిదు రూపాయలు మిగుల్తాయి.

అవి నూకలు కొనమని మల్లికిస్తాడు. మరి అలాంటప్పుడు మల్లికోరిక-అదీ తను అడిగిన మీదట కోరింది ఎలా తీర్చటం ?

ఎన్నాళ్లయినా ఇంతేగంద !

ఈవూళ్లో రిక్షా తొక్కేవాళ్లు ఒకసారిగా పెరిగి పోయారు-రిక్షా ఎక్కేవాళ్లు తనకోసం ధర్మప్రభువులైపోయి అడిగిందానికి రెట్టింపివ్వరు. అర్ధ రూపాయివ్వటానికి అరవై సార్లు ఆలోచిస్తారు !

మరి దాని ముచ్చట తీర్చేదెట్లా ?

అలా సందిగ్ధంలో పడి కొట్టుకుంటున్న నర్శింలుకి ఒక అవకాశం తన్ను కొచ్చింది.

ప్రక్క వీధిలో వుంటున్న కోదండరామయ్యగారనే అడ్వకేటు (పేరు కోదండరామయ్యగాని మనిషి మాత్రం భీముడిలా వుంటాడు) మరుసటిరోజు నర్శింలుని కబురెట్టి పిలిపించి, "రేయ్ నర్శిగా! రేపు వచ్చే శనివారం మా అమ్మాయి పెళ్లి-బస్టాండు దగ్గర కళ్యాణ మండపంలో. ఆరోజు ఉదయం ఏడింటికల్లా రిక్షా తీసుకొని రావాలి. రాత్రివరకు మాతోనే ఉండాలి. ఏమిప్పమంటావ్" అని అడిగారు.

నర్శింలు గతంలో లాయర్‌గారి పిల్లల్ని స్కూలుకి తీసికెళ్లి-తీసుకొచ్చే వాడు.

ఆ గౌరవంతో "మీ యిష్టం బాబూ - మీకు తెల్దా ఏంటి నా రెక్కల కట్టం" అన్నాడు.

"సరే పదిహేనురూపాయలిస్తా-సరేనా" అన్నాడు నర్శింలువంక సూటిగా చూస్తూ.

ఇంకా ఎక్కువ అడగాలనుకున్నాడు. కాని ఆయన కాదంటే తనకీ అవకాశం పోతుంది. అప్పుడు మల్లికోర్కె తీర్చే అవకాశం తనకుండదు.

అందుకే "సరేబాబూ" అనేశాడు. అనేసి రిక్షాతోసహా గాల్లో తేల్తూ గుడిసెకెళ్లి, మల్లికీ విషయం చెప్పి "అళ్లిచ్చే డబ్బుల్తో ఆ రంగేదో కొనుక్కో" అని ప్రకటించేశాడు.

మొగ్గలాంటి మల్లి మొహం ఆనందంతో వికసించింది.

శనివారం రానే వచ్చింది—-

ఆ రోజు మామూలుగా రిక్షా తీసుకుని బయల్దేరాడు నర్శింలు. టీ దుకాణంలో కాసిని టీనీళ్ళు తాగి, ఒక బీడీకట్ట కొనుక్కుని లాయర్‌గారింటికెళ్లాడు.

అప్పటికే ఆయన ఓడిపోయిన క్లైంటు ఫీజివ్వకుండా వెళ్లిపోయినట్టుగా కంగారడిపోతున్నారు-నర్సింలు ఇంకా రాలేదని. నర్సింలుని చూడగానే "పచ్చావా పదపద ఇప్పటికే ఆలస్యమైంది" అంటూ రిక్షానిండా సామాను పేర్చి తనూ చతికిలపడ్డాడు చలిమిడి సుద్దలా.

అలా కదిలిన రిక్షాకి నర్సింలుకి మధ్యాహ్నం రెండింటివరకు తీరిక లేకుండా పోయింది.

పెళ్లికొచ్చిన చుట్టాలు ఎప్పుడూ రిక్షామొహం చూడనట్లు ఎక్కికూర్చుని రోడ్లన్నీ తిప్పించారు.

లేదంటానికి వీల్లేదు కాంట్రాక్ట్ బేరం!

"నేను కారువంక, ఇమానంవంక చూసినట్లు ఈళ్లు నా రిక్షావంక సూత్తుండారు-ఏడనుండి వూడిపడ్డారో ఈళ్లంతా" అనుకున్నాడు కసిగా.

మధ్యాహ్నం రెండయింది.

పెళ్లివారింట్లో భోజనాలవుతున్నాయి.

రిక్షాకి కాస్త రెస్ట్ దొరికింది. నర్సింలుకి ఆకలి దంచేస్తోంది.

కూటికి గుడిసెకి పోవాలో, లేక ఈళ్లు పెడతారో అర్థంకాలేదు.

అలాగే ఎదురుచూస్తూ కూర్చున్నాడు చాలాసేపు.

కాని ఎవ్వరూ అతడినిగూర్చి పట్టించుకోలేదు.

"ఈ పాటికి మల్లికూడా కూడు తినేసేవుంటుంది. పొద్దున్న వచ్చేటప్పుడు చెప్పేవచ్చాడు. నేను ఇయ్యాల పెళ్లోరింట్లొ భోంచేత్తానని"

ఇంక లాభంలేదని పెళ్లి ఇంత రొట్టెతిని టీనీళ్లు తాగేసివద్దాం అనుకుంటుండగా, పెళ్లివారి భోజనాలయిపోయి, బిలబిలమంటూ బొజ్జలుమునిరుకుంటూ వచ్చి రిక్షాలో కూలబడి "విడిదికి పోనీయ్" అన్నారు.

విడిదింటికీ పెళ్లివారింటికి మధ్య మళ్లీ త్రిప్పట మొదలైంది.

పెళ్లికొచ్చిన వారిలో ఒక లావుపాటి పిన్నిగారు (ఆవిడ పేరు గాని, పెళ్లికుమారుడికి ఏమౌతుందోగాని తెలీదు నర్శింలుకి) రిక్షాలో విపరీతంగా తిరిగేస్తోంది. ఆవిడ సంతానాన్ని రవాణా చెయ్యటానికే మూడు ట్రిప్పులు వెయ్యాల్సొచ్చింది-"మాతల్లి మీలాంటోళ్లకి రిచ్చాకన్నా లాగుడుబండయితే బాగుంటాది" అని చెప్పాలనుకున్నాడు.

"రేయ్ నర్శింలు పిల్లని కాస్త రిక్షాలో కూర్చోపెట్టి తిప్పుతూ వుండు. నేవెళ్లి చీర మార్చుకొస్తా" అంది ముప్పయిఆరోసారి రిక్షాదిగి పిల్లని నర్శింలు కందిస్తూ లావుపాటి పిన్నిగారు.

"తల్లీ నీ బేరానికో దణ్ణం" అని వెళ్లిపోదాం అనుకున్నాడు.

కాని మల్లి గుర్తుకొచ్చింది. దాని ముచ్చట జ్ఞాపకానికికొచ్చింది.

కిక్కురుమనకుండా పిల్లనందుకొని రిక్షాలోకూలేసి తనూ రిక్షా ఎక్కాడు.

అలా రాత్రి పదింటిదాకా విరామంలేనుండా రిక్షాని తొక్కుతూనే వున్నాడు.

ఒళ్ళు హూనం అయిపోయింది. ఒంట్లో సత్తువైపోయింది. పొద్దున తాగిన టీ నీళ్ళు తప్ప పచ్చిగంగకూడా ముట్టలేదు. కళ్ళు తిరుగుతూన్నట్లుగా అనిపించింది. పిన్నిగారి ఫ్యామిలీని పెళ్ళివారింటికి తీసుకొస్తున్న నర్సింలికి.

వాళ్ళనక్కడ దింపేసి చివరి బీడీ నివెలిగించాడు.

బీడీని ఒక దమ్ములాగాడో లేదో - సుడిగాలిలా వచ్చింది పిన్నిగారు వెనక్కి తిరిగి.

"రేయ్ నర్శింలూ! అమ్మాయి కాలి పట్టా రిక్షాలో పడిందేమో చూడు" అంటూ.

నర్శింలు ఒక్కసారి రిక్షాలోను, సీటుక్రింద, పక్కల్నీ చూసి "లేదండీ" అన్నాడు.

"అయ్యో అదేమిట్రా, రిక్షాలోకూర్చునప్పుడు గూడా ఉందిరా, దిగి లోపలికెళ్ళాను కన్పించలేదు...తిన్నగా చూడాలి" పెద్దగా అరుస్తోంది.

అప్పటికీ పెళ్ళి జనం మెల్లిమెల్లిగా రాసాగారు.

పిన్నిగారు అరుస్తోంది----నర్సింలు మెల్లిగా "రిక్షాలో పడలేదండి" అంటు న్నాడు. చుట్టూ మూగిన జనం అందరూ తలోమాట అంటున్నారు.

ఈ గొడవకి లోపల్నించి కోదండరామయ్యగారొచ్చి, విషయం విన్నాక నర్సింలుని చూసి "అలా గుడ్లప్పగించి చూస్తావేరా, తిన్నగావెతుకు" అన్నారు కోపంగా.

"ఇంతవరకు పెళ్ళి సవ్యంగా ఏమాట పలుకు లేకుండా అయిపోయింది. ఇప్పుడు ఈ చిన్న విషయంవల్ల తనకి అప్రతిష్ట రాకుండా చూసుకోవాలి" అనుకున్నాడు లాయరుగారు మౌనంగా

"చిత్తం చూశానండి-రిచ్చాలో పడలేదండి" అన్నాడు వినయంగా నర్సింలు.

"ఏడ్చావ్ రిక్షాలోకాకపోతే ఇంకెక్కడ పడుతుంది"-తిన్నగా చూడు.

"లేదండి అంతా వెతికే చెబుతున్నానండి-రిచ్చాలోమాత్రం పడలేదండి"

"అయ్యో లేదన్నయ్యగారు-రిక్షాలో వస్తున్నప్పుడు కూడా వుంది-దిగి ఆలా లోపలికొచ్చాను, అంతేకన్పించలేదు" పిన్నిగారు విన్నవించుకొన్నారు.

విన్న కోదండరామయ్యగారు నర్సింలువంక చూసాడు. నర్సింలుకి కంగారు పుట్టింది. "నాకు తెల్దండి సత్తెపెమానంగా నాకు తెల్దండి" భయంగా అన్నాడు.

వీడి కంగారుచూసి లాయరుగారి చూపుల్లో అనుమానం బలపడింది.

కోపంతో బుసలు కొట్టసాగారు.

మగపెళ్ళి వారిలోంచి ఎవరో అన్నారు "రెండు తగిలించండి. వెదవ వాడే చెపుతాడు" అని.

కోదండరామయ్యగారు చొక్కా పైకిమడచి, "రేయ్ గాడ్దికొడకా తెలి సినవాడివని పిలిపిస్తే ఇదన్నా నువ్వు చేసేది...చెప్పు ఎక్కడ దాచావో?" నర్సింలు చొక్కాని రెండు చేతుల్తో పట్టుకుని గుంజుతూ అన్నారు.

"బాబూ నిజంగా నాకు తెల్దండి. రిచ్చాలో పడలేదు బాబూ" భయంతో వణకిపోతూ అన్నాడు.

"రాస్కెల్ చెప్పు ఎక్కడదాచావో?" బలంగా గుంజి వెనక్కితోశాడు.

నర్సింలు వెళి పందిరి గుంజకి కొట్టుకుని కిందపడ్డాడు.

అతడి తల బలంగా పందిరి స్తంభానికి కొట్టుకుంది.

అదే అదనుగా అందరూ తలో తన్ను తన్నారు.

నర్సింలు ఏడుస్తూ "నాకు తెల్దుబాబూ" అంటున్నాడు.

ఆ దశలో లావుపాటి పిన్నిగారికి గుర్తొచ్చినట్టుంది. ఇందాక పిల్ల కాలి కున్న పట్టాని వూడదీసి తన చీర కొంగున కట్టుకున్నట్టు.

అందుకే చీర కొంగుని ఎవ్వరికీ కన్పించకుండా బొడ్లో దోపుకుంటూ "పోన్లేరా అబ్బాయిలు-పోతేపోయింది వెధవ పట్టా-వాడి పాపానవాడే పోతాడు వాడ్ని పోనీయండి" అని అందర్నీ సర్దింది.

కోదండరామయ్యగారు మళ్ళీ కోపంగా ముందుకువచ్చి, "ఫో దొంగ వెధవా-బతికిపోయావ్- నీ ముఖం నాకు చూపించక ఫో అవతలకి" అంటూ ఒక నెట్టునెట్టారు.

జనం మెల్లిమెల్లిగా తప్పుకున్నారు.

పిన్నిగారు, లాయరుగారు కూడా లోనికెళ్ళిపోయారు.

నర్సింలు లేని ఓపికని తెచ్చుకొని లేచి నిలబడ్డాడు.

కళ్ళు తుడుచుకున్నాడు.

పెళ్ళివారి ఇంటివంక అసహ్యంగా చూసాడు.

దెబ్బ తగిలినచోట కాస్త మంటగా అనిపించింది,

కాని లెక్కపెట్టక బయటకొచ్చి, రిక్షా చేత్తో పట్టుకుని గుడిసెవేపు కదిలాడు.

పరువు పోయింది-రావాల్సిన డబ్బు పోయింది-ఒంట్లో ఓపిక పోయింది-అన్నీ పోయాయ్—

కాని ఒకటే తృప్తి- తనే పాపం ఎరుగడు- తను దొంగకాదు-దొరే !

వెనక్కి వెళ్ళి అక్కడున్న వాళ్ళందరికి చెప్పాలనుకున్నాడు.

"బాబూ నేను దొంగనికాదు—దోచే అలవాటుంటె నేనూ రిచ్చాలో కూర్చునేవాడిని-ఇలా రిచ్చాతోక్కేవాడిని కాను" అని.

కాని అతడి ఒంట్లో ఓపికలేదు----కళ్ళు తిరుగుతున్నాయి.

గుడిసెకి చేరి రిషాని అవతలకినెట్టి లోనికెళ్ళి మంచంమీద పడిపోయాడు.

మల్లి ఆత్రంగా దగ్గిర కొచ్చింది "మావా వుడుకునీళ్ళెట్టనా" అంది.

కాని నర్సింలు ఏం మాట్లాడలేదు.

దగ్గిరకొచ్చి ఆప్యాయంగా ప్రక్కలో కూర్చుని "మావా అలసిపో యావా-నాగురించేకదూ నువ్వింత కట్టపడుతున్నావ్" అంటూ చేతివేళ్ళని అతడి జుట్టులోనికి పోనిచ్చింది. కాని పాముని ముట్టుకున్నట్టుగా చేతిని వెనక్కి- లాక్కుంది.

చేతికి వెచ్చగా జిగటగా ఏదో అంటింది. చటుక్కున లేచి కోడిగుడ్డు దీపం తెచ్చి పరీక్షగా చూసింది.

అది మావ నెత్తురు !

ఒక్కసారి భయంగా అరిచింది.

పడుకున్న నర్సింలు కళ్ళుతెరచి చూశాడు.

ఆ గుడ్డి వెలుగులో తన రక్తంతో తడిసిన ఆమె గోళ్ళు ఎర్ర రంగేసు కున్నట్టుగా కన్పించాయ్ నర్సింలుకి.

నిస్సహాయంగా, నీరసంగా నవ్వి మళ్ళీ కళ్ళు మూసుకుని పడు కున్నాడు.

అలా పడుకున్న అతడి మొహంలో-వాళ్ళ జీవితాల్లోలాగా ఏరంగులూలేవు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక కాళయుక్త దీపావళి కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ)

# పొదురూ - బడాయ్

రైల్వేలో పన్చేసి రిటైరయిన సుందర్రామయ్యా గారు మూర్ఛోటాలుగా గుటగుటలాడుతున్నారు. ఆ రోజు రాత్రి మళ్ళీ అనుమానం వచ్చి బయట పడుకోపెట్టారు. అప్పుడే సెకండ్ షో సినిమా నుంచి వచ్చిన ప్రక్కింటి పరమేశ్వర్రావు-

"ఎంత సేపయిందండీ ప్రాణం పోయి" అనడిగాడు-

"ఇంకా బ్రతికే వున్నారండి. ఏమిటా మాటలు" అంటూ కసుర్నమన్నారు బంధుజనం.

"ఛీ ఛీ! - ఇక్కడ కూడా లేటేనా ?" అంటూ విసుకున్నాడు పరమేశ్వర్రావు.